
సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



చినుకు పడితే వణుకే

నదీ తీర గ్రామాలు చినుకు పడితే వణికిపోతున్నాయి. రక్షణ లేకపోవడంతో ఊళ్లన్నీ భయపడుతున్నాయి. - 8లో



నిమజ్జనోత్సాహం..

జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి ఘనంగా అనుపోత్సవాలు జరిగాయి. నాగావళి, వంశధారలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ప్రత్యేక బీఎడ్‌లో 25 మంది చేరిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బీఎడ్‌లో (మెంటల్లీ రిటార్డు)లో 25 మంది చేరారు. ఎడ్‌సెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ సెల్ఫ్ రిపోర్టుకు చివరి తేదీ కాగా, 30 మంది అలాట్‌మెంట్ ఆప్షన్లు ఇచ్చుకోగా, 25 మంది ప్రవేశాలు పొందటంతో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సెల్ఫ్ రిపోర్టు ఇవ్వని సీట్లకు రెండో కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్ సీజ్



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి బ్రిడ్జి అండర్ పాస్ వద్ద అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పట్టణానికి చెందిన నాగం కృష్ణంబాబు, ఆశి శ్రీనివాసరెడ్డిలను రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ పట్టుకున్నారు. సోమవారం వేకువ జామున బాహుదా నది నుంచి ట్రాక్టర్‌పై ఇసుకను తరలిస్తుండగా తన సిబ్బందితో ఎస్‌ఐ పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ఇరువురుపై కేసు నమోదు చేశారు.

మంచినీరు అడిగి బంగారం చోరీ

కాశీబుగ్గ: మంచినీరు ఇచ్చిన పాపానికి బంగారం దోచుకుపోయిన ఘటన పలాసలో చోటు చేసుకుంది. మున్సిపాలిటీలోని 20వ వార్డు శివాజీనగర్‌లో ఉంటున్న పెంట కృష్ణవేణి వద్దకు ఓ యువకుడు వచ్చి మంచినీరు అడిగాడు. ఆమె నీరు తీసుకువస్తుండగా ఇంటిలోకి జొరబడి కత్తి చూపించి ఆమె వద్ద ఉన్న చైను, తాడు మొత్తంగా నాలుగు తులాల బంగారం దోచుకున్నాడు. అనంతరం ఇంటి బయటకు వచ్చి పరారయ్యాడు. ఆమె బయటకు వచ్చి జరిగిన సంఘటనను స్థానికులకు చెప్పగా వారు పోలీసులకు సమాచారం అందించారు.

'చీకటి వ్యాపారం'పై అధికారుల కదలిక



కొచ్చెర్లలో అక్రమ ఇసుక ఇల్వ ఉంచిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: సముద్రపు ఇసుక, గెడ్డ ఇసుక కలగలిపి గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి లారీల్లో విశాఖ తరలింపు చేయడంపై 'సాక్షి'లో ప్రచురించిన 'చీకటి వ్యాపారం' కథనానికి అధికారులు స్పందించారు. శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద, జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల రెవెన్యూ, పోలీస్ అధికారులతో సోమవారం సముద్ర తీర ప్రాంతం మొత్తం కలియతిరిగారు. ముద్దాడపేట, చిన రుప్పపేట, కొత్తముక్కాం, రేగపాలెం తదితర ప్రాంతాల్లోనూ పరిశీలించారు. రణస్థలం మండలంలోని కొత్తముక్కాం ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన కల్తీ ఇసుకను పరిశీలించారు. ఈ భూ యజమానులు, అక్రమ ఇసుదారులను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సముద్ర ఇసుక అక్రమ రవాణాపై నిఘా పటిష్టం చేస్తామన్నారు. ఇసుక అక్రమంగా నిల్వ ఉంచిన కొచ్చెర్లకు సంబంధించి ఒక వ్యక్తిని జేఆర్ పురం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ పరిశీలనలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తహసీల్దార్లు సింహాచలం, వై.జోగారావు, ఎస్.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సంక్షోభంలో సంక్షేమం

- సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు
- పెచ్చులూడుతున్న భవనాలు
- అధ్వానంగా హాస్టల్ పరిసరాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- 'సాక్షి విజిట్'లో వెలుగు చూసిన ఇబ్బందులు

సాక్షి విజిట్

సంక్షేమం నిద్రపోతోంది. భావితరాలను తీర్చిదిద్దాల్సిన వసతి గృహాలు వసతుల లేమితో కునారిల్లుతున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో విద్యార్థులు అరకొర వసతుల నడుమే చదువులు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కొత్త మెనూ అమలుకాకపోవడం, హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం సక్రమంగా దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల అపరిశుభ్ర వాతావరణంలోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వ వసతి గృహాలు, కేజీబీవీల్లో 'సాక్షి విజిట్' నిర్వహించగా విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. – సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



శ్రీకాకుళం గిరిజన ఆశ్రమ పాఠశాల పరిసరాల్లో పందుల స్వైర విహారం



పాతటెక్కలి వసతి గృహంలో ఇటీవల వర్షం పడినప్పుడు హెల్మెట్ పెట్టుకుని వంట చేస్తున్న కుక్, హెల్పర్

వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి బీసీ బాలుర వసతి గృహం శిథిలమైంది. శ్లాబ్ పైకప్పు పెచ్చులూడి వర్షం నీరు కారుతోంది. వసతి గృహంలో ఉన్న 35 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వంట గదిలో కుక్ కిరణ్ హెల్మెట్ పెట్టుకుని వంట చేస్తుండగా శ్లాబ్‌పై కప్పు నుంచి కారుతున్న నీరు వంటలపై పడకుండా హెల్పర్ రామారావు వంటపాత్ర మూతను అడ్డుపెట్టుకుని వంట చేశారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, కుళాయి ట్యాప్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. పలాస పలాస మండలం లొత్తూరు గిరిజన సంక్షేమ వసతి గృహానికి ప్రహరీ లేక రాత్రివేళ విద్యార్థులు భయపడుతున్నారు. –పలాస

● ఆరుబయటకు వెళ్లాల్సిందే...

జలుమూరు మండలం శ్రీముఖలింగంలో 30 ఏళ్లుగా అద్దె గృహంలోనే బాలుర వసతి గృహం నడుపుతున్నారు. మరుగుదొడ్లు సరిపడకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. సారవకోట మండలం సవరబొంతు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ఉన్న బావి నీరే ఆధారం. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులే వార్డెన్లుగా నెలకొకరు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయ, వార్డెన్లుగా రెండు విధులు నిర్వర్తించడం కష్టంగా ఉంటోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. –నరసన్నపేట



సవరబొంతు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు వినియోగించే బావి నీరు

● వానొస్తే అంతే..

శ్రీకాకుళం నగరంలోని బీసీ, ఎస్సీ, సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. పాత భవనాలు, నిర్వహణ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షమొచ్చినా పరిసరాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఇంజిన్లు పెట్టి నీటిని తోడాల్సిన పరిస్థితి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బీసీ, గిరిజన, వసతి గృహాల్లో చాలాచోట్ల కిటికీలకు దోమతెరలులేవు. తలుపులు పాడైపోయాయి. సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి మెస్ బిల్లులు విడుదల కావడం లేదు. విద్యార్థులకు కాస్మొటిక్ బిల్లులు సైతం అందని పరిస్థితి నెలకొంది. –శ్రీకాకుళం



శ్రీకాకుళంలో ఇటీవల కురిసిన వాన తరువాత..

● శిథిలావస్థ...

ఆమదాలవలస పట్టణంలోని కొత్తకోటవారి వీధి లో బీసీ సంక్షేమ వసతి గృహం పూర్తిగా శిథిలమైంది. పైకప్పులు పెచ్చులూడుతుండటంతో ఇక్కడున్న 49 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్, అధికారులు భవనాన్ని పరిశీలించి ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగవచ్చునని, వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. – ఆమదాలవలస



ఆమదాలవలస బీసీ బాలురు వసతి గృహంలో పూర్తిగా శిథిలమైన గదులు

● బాబోయ్ దుర్గంధం



కొత్తపాలెం(కవిటి) కేజీబీవీ ఆవరణ

కవిటి మండలంలోని కొత్తపాలెం కేజీబీవీ లో పారిశుధ్యం లోపించింది. పల్లపుప్రాంతం కావడంతో వరదనీరు బయటకు వెళ్లటం లేదు. పరిసరాలన్నీ దోమలకు నిలయంగా మారడంతో బాలికలు తరచూ జ్వరాల బారిన పడుతున్నా రు. కంచిలిలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు వసతి సమస్యతో సతమతమవుతున్నారు. డార్మిటరీలు శిథిలావస్థకు చేరాయి. తరగతి గదులు కూడా సరిపడా లేవు. – ఇచ్ఛాపురం

● సమస్యల తిష్ట..



ఎల్.ఎన్.పేట ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహంలో కిటికీల్లేని తరగతి గదులు

ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహంలో నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. డైనింగ్ హాల్లో శ్లాబు పెచ్చులూడుతోంది. హిర మండలంలోని మర్రిగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు)లో సమస్యలు తిష్టవేశాయి. గదుల్లో సీలింగ్ సమస్య వల్ల విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. కొద్దిపాటి వర్షమొచ్చినా హాస్టల్‌కు వచ్చేదారి బురదమయమవుతోంది. బందపల్లి గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో కొన్ని మరుగుదొడ్లకు తలుపులు లేవు. – పాతపట్నం

● అంధకారమే..

లావేరు మండలం కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యుత్ కోతలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సరిపడా ఇన్వర్టర్లు లేకపోవడంతో రాత్రిపూట కరెంట్‌పోతే చదువుకునేందుకు అవస్థలు తప్పడం లేదు. ఒకే ఇన్వర్టర్ ఉండటంతో సామర్థ్యం సరిపోవడం లేదని చెబుతున్నారు. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా వసతి సౌకర్యం లేదు. డార్మిటరీలు, డైనింగ్ హాల్ కొరత ఉంది. పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేదు. – ఎచ్చెర్ల

● సరిపడా గదులేవీ..

టెక్కలి ఆదిఆంధ్రావీధిలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో ఆరుబయటే భోజనాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సంతబొమ్మాళి మండలం బోరుభద్ర బీసీ బాలుర వసతి గృహానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో ఇరుకుగదుల్లో ఉండాల్సిన పరిస్థితి. సంతబొమ్మాళి బీసీ బాలుర వసతి గృహంలో తాగునీటి సమస్య నెలకొంది. – టెక్కలి

18న ఐటెప్ ప్రవేశాల జాబితా

ఎచ్చెర్ల క్యాంపస్: గత విద్యా సంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐటెప్ (ఐటీఈపీ, నాలుగేళ్ల సమీకృత విద్యా డిగ్రీ కోర్సు) ప్రవేశాల జాబితా ఈ నెల 18వ తేదీన ప్రకటించనున్నారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా స్వీకరణ, పార్సిల్ సర్వీస్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ముగియగా, వరుస సెలవులు కావటంతో పార్సిల్ సర్వీస్ దరఖాస్తులు మంగళవారం సైతం స్వీకరిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్ష స్కోర్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. అయితే అనుకున్న స్థాయిలో మాత్రం దరఖాస్తులు రాలేదు. వర్సిటీలో బీఎస్సీబీఎడ్‌లో 50 సీట్లు, బీఏ బీఎడ్‌లో 50 సీట్లు ఉన్నాయి. 56 దరఖాస్తులు వచ్చాయి. మిగులు సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో నిర్వహిస్తారు.

18.19 కిలోల గంజాయి స్వాధీనం

కంచిలి: ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రాంపల్లి గ్రామం, కొదలా ప్రాంతం నుంచి 18.19 కిలోల గంజాయిని ముంబైకి తరలిస్తుండగా సోంపేట రైల్వే స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం స్థానిక పోలీసులు అడ్డుకున్నారని ఏఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్ర పరిధి గంజాం జిల్లా కొదల రాంపల్లి గ్రామస్తులు సంజయ్ పలాట, సాగర్ పలాట అనే వ్యక్తులు ముంబైకి చెందిన ముఖేష్ అనే వ్యక్తి తో గంజాయి వ్యాపారం చేస్తున్నారు. సంతోష్ కుమార్ సాహు అనే వ్యక్తికి గంజాయి ఇచ్చి ఒడిశా నుంచి ముంబైకి తరలించడానికి సిద్ధమయ్యారు. రైల్వేస్టేషన్ వద్ద సంతోష్ కుమార్ ఒక ట్రాలీ సూట్‌కేస్, మరో చేతి బ్యాగులో సరుకు తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఆపరేషన్‌లో చురుగ్గా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సరుకును సీజ్ చేసి, ముద్దాయి సంతోష్‌కుమార్ సాహును పోలీసులు అరెస్టు చేశారు. సమావేశంలో సోంపేట సీఐ బి.మంగరాజు, స్థానిక ఎస్‌ఐ జి.రాజేష్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో వివరాలు చెబుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

ఈయన పేరు బొడ్డేపల్లి గోపి. పొందూరు మండలం మొదలవలస గ్రామ రైతు. భారీ వర్షాలకు రెల్లిగెడ్డలో నీరు ఈయన ఎకరా వరి పంట పొలాల్లోకి చేరింది. దాదాపు ఏడు రోజులు నీరు అలాగే నిలిచిపోయింది. దీంతో పంట కుళ్లిపోయి మరో పంట వేసేందుకు కూడా పొలం పనికి రాకుండా మారిపోయింది.



కూలిన ఇంట్లో ఉన్న ఈమె పేరు అముజూరు జ్యోతి. ఆమదాలవలస పట్టణంలోని వెంగళరావు కాలనీలో ఈమె ఇల్లు ఇటీవల వర్షాలకు కూలిపోయింది. అధికారులు వచ్చి ఫొటోలు తీశారు గానీ ఎలాంటి సాయం చేయలేదు. మళ్లీ వర్షం పడితే ఏమవుతుందోన్న భయం వెంటాడుతోంది.




భారీ వర్షాలకు గతుకులతో ధ్వంసమైన రోడ్డు ఇది. పలాసలోని 24వ వార్డు పురుషోత్తపురం ప్రాంతంలో ఉంది. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.



కష్టాలు.. కన్నీళ్లు

- వాయుగుండం ప్రభావంతో జిల్లాకు తీరని నష్టం
- రూ.39.10కోట్ల మేర నష్టం జరిగినట్టు అంచనా
- ముందస్తు ఖర్చులకు ఒక్కపైసా ఇవ్వని ప్రభుత్వం



మొదలవలస గ్రామంలో ముంపునకు గురైన పొలాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఇటీవల కురిసిన వానలు కష్టాలు, కన్నీళ్లను ఆనవాళ్లుగా మిగిల్చాయి. ఇప్పటికీ వరద గాయాలు కనిపిస్తూనే ఉన్నాయి. దాదాపు రూ.39.10కోట్ల నష్టం జరిగినట్టు జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. వరదల తాకిడికి రోడ్లు, చెరువులు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో నాలుగు వంతెన/కల్వర్టులు దెబ్బతిన్నాయి. పంచాయతీ రాజ్ పరిధిలోని వీటిని పునర్నిర్మించాలంటే రూ.7500 కోట్లకు పైగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు.

ముందస్తు నిధులే లేవు

సాధారణంగా భారీ వర్షాలు కురిసినప్పుడు ముందస్తుగా అప్రమత్తం కావడానికి జిల్లాలకు ప్రభుత్వం ఎంతో కొంత నిధులు ముందస్తుగా విడుదల చేస్తుంది. కానీ ఈ ప్రభుత్వం ఒక్క పైసా విడుదల చేయలే దు. తాత్కాలిక పనులను కూడా చేపట్టలేకపోయా రు. ఇల్లు కోల్పోయిన వారికి పునరావాసం పక్కన పెడితే కనీస సాయం చేయలేదు. ముంపునకు గురైన వరి పొలాలను సైతం నిబంధనల ముసుగులో పక్కన పెట్టేసింది. దీంతో మునిగిన పంటను బతికించుకునేందుకు బూస్టర్ డోస్ ఎరువులను వేసుకు ని కాపాడుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

మూడు రోజులు దంచికొట్టిన వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. సెప్టెంబర్ నెలలో జిల్లాలో 4805.8మిల్లీమీటర్లు(సరాసరి 160.2) పడగా, అందులో వాయుగుండం ప్రభావం ఉన్న మూడు రోజులు(7,8,9న) 3,063 మిల్లీమీటర్లు వర్షం పడింది. ఈ వానలకు వాగులు, గెడ్డలు వరద నీటితో పోటెత్తాయి. కొన్ని చోట్ల గండ్లు పడ్డాయి. పలుచోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. వీటి వరద ఉద్ధృతికి సమీపంలో ఉన్న పంట పొలా లు నీట మునిగాయి. పలుచోట్ల రోడ్లు ధ్వంసమ య్యాయి. అటు ఒడిశాలోనూ, ఇటు జిల్లాలోనూ కురిసిన వర్షాలకు వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదులు పొంగి ప్రవహించాయి. దీంతో పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట ముని గాయి. వర్షం విరామం ఇచ్చాక పంట పొలాల్లో ఉన్న నీరు చాలా వరకు బయటకు వెళ్లిపోయింది. దీంతో అధికారుల లెక్కలోకి పంట ముంపు రాలేదు. ఇప్పటివరకు అధికారుల లెక్క ప్రకారం 50హెక్టార్లలోపే పూర్తి స్థాయిలో వరి పంట నష్టపోయినట్టు అధికారులు నిర్ధారించారు.


57 ఇళ్లు నేలమట్టం

భారీ వర్షాలకు తడిచి ముద్దయి జిల్లాలో 57 ఇళ్లు కూలిపోయాయి. వాటిలో ఉన్న వారంతా నిరాశ్ర యులైపోయారు. ఇంత జరిగినా ప్రభుత్వం వారికి కనీసం సాయం చేయలేదు.

దారులు ధ్వంసం

వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలో ఉన్న రోడ్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. వరదల దాటికి చాలా వరకు ధ్వంసమైపోయాయి. అందులో ఆర్అండ్‌బికి భారీ నష్టం వాటిల్లింది. అధికారిక లెక్కల ప్రకారం 250.87కిలో మీటర్ల పొడవైన రో డ్లు పాడయ్యాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలంటే రూ. 2కోట్ల 63లక్షల 47వేలు ఖర్చు కానుండగా, శాశ్వత పనులు చేపట్టాలంటే రూ. 66కోట్లు ఖ ర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇక, పంచాయతీరాజ్ పరిధిలోని 35కిలోమీటర్ల పొడవు నా రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకై తే రూ. 21లక్షలు ఖర్చు కానుండగా, పంచాయతీ రాజ్ పరిధిలోని నాలుగు వంతెనలు/కల్వర్టులు దెబ్బతిన్నాయి. అలాగే పలు గ్రామాల్లో 70 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 26 ట్రాన్స్ పార్మర్లు కూడా దెబ్బతిన్నాయి. వీటి నష్టం రూ. 45లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 44 చానల్స్ దెబ్బతిన్నాయి. తాత్కాలిక పనులకు రూ. 63.20లక్షలు ఖర్చు కానుండగా, శాశ్వత పనులకు రూ. 3కోట్ల 13లక్షల80వేలు ఖర్చు కానుంది. 32 వలలు కూడా పాడైపోయాయి.

పంటను నష్టపోయాను



రెండు సార్లు దుక్కుదున్ని, విత్తనాలు జల్లి, మొలకలు వచ్చేంత వరకు భూమిని కాపాడుకొని, గాబు తీయించి, ఎరువులు, మందులు జల్లినందుకు సుమారు రూ. 10 వేలు ఖర్చయ్యింది. పంట పూర్తిగా నీటిలో ఉండడంతో శ్రమ, పంట రెండూ పోగొట్టుకున్నాను.
– వెంకటరావు, మొదలవలస, పొందూరు

ఆశ కార్యకర్తపై దాడి

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామంలో ఆశ వర్కర్‌పై సోమవారం రాత్రి టీడీపీ నాయకులు దాడికి దిగారు. కిష్టుపురం గ్రామంలో బూర్లె కృష్ణవేణి ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఇంటి వద్దకు మామిడి లలితమ్మ వచ్చి జ్వరానికి, బీపీకి మాత్రలు ఇవ్వమని అడగడంతో.. జ్వరానికి మాత్రలు ఇచ్చి బీపీకి డాక్టర్లు మాత్రమే పరీక్షించి ఇస్తారని చెప్పారు. దీంతో లలితమ్మ భర్త టీడీపీకి చెందిన కృష్ణారావు, కుమారుడు మోహనరావులు కృష్ణవేణిపై దాడికి దిగారు. ఆశ వర్కర్ భర్త రామారావు, కుమారుడు లీలాధర్ వచ్చి అడ్డుపడినా వారిపైనా దాడికి దిగారు. అనంతరం కృష్ణవేణి పలాస ఆస్పత్రికి వెళ్లగా.. డ్యూటీ డాక్టర్ చిన్నంనాయుడు పోలీసు ఫిర్యాదు చేయాలని సూచించడంతో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. టీడీపీ నాయకులు దాడి విషయంపై సీఐ మోహనరావుకు ఫిర్యాదు చేశారు.



బూర్లె కృష్ణవేణి

● ప్రవక్త మార్గం అనుసరణీయం



మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు చోట్ల ర్యాలీలు చేశారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని ఇచ్ఛాపురంలో మత గురువులు బోధించారు. - ఇచ్ఛాపురం

చినుకు పడితే వణుకే



బూర్జ గ్రామం వద్ద గట్టు లేక సమాంతరంగా ఉన్న నాగావళి నది

- వంశధార, నాగావళి కరకట్టల కోసం తీర ప్రాంత వాసుల ఎదురుచూపులు
- నదీ తీర ప్రాంతవాసులకు ఏటా తప్పని ముంపు భయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని వంశధార, నాగావళి నదీ తీర ప్రాంత వాసులు చినుకు పడితే చాలు వణికిపోతున్నారు. జూలై నెల నుంచి దాదాపుగా నాలుగు నెలల పాటు వీరంతా భయంభయంగా గడుపుతున్నారు.

నాగావళి నది మన వద్ద మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలంలో చిలకాపల్లి నుంచి శ్రీకాకుళం మండలం కళ్లేపల్లి వరకు సుమారు 110 కిలోమీటర్లు మేర ఉంది. ఈ తీర ప్రాంతానికి ఆనుకుని వందలాది గ్రామాలు ఉన్నాయి. బూర్జ మండలంలో లాభాం, బూర్జ, కాఖండ్యాం, ఆమదాలవలస మండలంలో దూసి, తొగరాం, ముద్దాడపేట, దూసిపేట, తోటాడ, ఇసుకలపేట, శ్రీకాకుళం మండలంలో బలగ, హయాతీనగరం, ఫాజుల్‌బాగ్‌పేట, పెలసవీధి ఏటా ముంపు భయాన్ని ఎదుర్కొంటున్నాయి. ముంపు బారి నుంచి వీరిని రక్షించడానికి 2007లో వైఎస్సార్ హయాంలో కరకట్టల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ పనులు వంద శాతం పూర్తి కాని కారణంగా ఇప్పటికీ తీర ప్రాంత వాసులు వరదంటేనే వణికిపోతున్నారు. పనులు ప్రారంభించి పదిహేనేళ్లవుతున్నా 51.88 కిలోమీటర్ల పనులకు కేవలం 17.20 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యాయి. కాంక్రీట్ పనులు సీసీవాల్స్ 3.18 కిలోమీటర్ల పనులకు గాను 2.13కిలోమీటర్ల మాత్రమే పూర్తి చేశారు. దీనికి తోడు ఇసుక అక్రమార్కులు ఇదే కరకట్టలపై భారీ వాహనాలతో ఇసుక తరలించుకునేందుకు మార్గాలుగా వినియోగించడంతో గట్లు బలహీన పడుతున్నాయి.

వంశధార కరకట్టల పనుల కథ కూడా అంతే. జిల్లాలో కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, శ్రీకాకుళం, గార మండలాల్లో సుమారు 82కిలోమీటర్ల పొడవున వంశధార ప్రవహిస్తోంది. కానీ ప్యాకేజీ–1లో 8 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగలిగారు. ప్యాకేజీ–2లో 5 శాతం పనులు, ప్యాకేజీ–3లో ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రావర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు దొంగ బీసీలు పెట్టడంతో వీరిని పూర్తిగా టెర్మినేట్ చేశారు. ప్యాకేజీ–4లో పనులేవీ చేయలేదు.

చర్యలు చేపడతాం



వంశధార, నాగావళి కరకట్టల పనుల్ని పాతకాంట్రాక్టుల వద్ద గత ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశారు. కొత్తగా అంచనాలు వేయాలని ఆదేశించారు. అంచనాలను పంపించాం. ఈ ప్రభుత్వంలోనైనా మిగిలిన పనులకు నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు సంరక్షించగలుగుతాం.

– పొన్నాడ సుధాకర్, జలవనరులశాఖ ఎస్ఈ, శ్రీకాకుళం.

ఏటా ఇబ్బంది పడుతున్నాం



ఏటా వర్షాకాలం వచ్చిందంటే గ్రామంలో ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నాం. అలాగే పంట పొలాలు మునిగిపోతున్నాయి. నాగావళి నది పక్కనే ఉండడం మాకు శాపంగా మారింది.

– భైరి కృష్ణమూర్తి, బూర్జ గ్రామం, బూర్జ మండలం

క్లుప్తంగా

సుంకర జగన్నాథపురంలో వైద్య శిబిరం



సుంకర జగన్నాథపురంలో రోగుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం 'సాక్షి'లో 'మంచం పట్టిన సుంకర జగన్నాథపురం' అనే కథనానికి గోవిందపురం పీహెచ్‌సీ వైద్యులు స్పందించారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటా సర్వే నిర్వహించి వైద్యం అందించారు. మరో రెండు రోజులు శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

బీఎడ్ కళాశాలల స్టాఫ్ ర్యాటిఫికేషన్‌కు సన్నద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీఎడ్ కళాశాలల ర్యాటిఫికేషన్‌కు రంగం సిద్ధమవుతోంది. స్టాఫ్ ర్యాటిఫికేషన్ మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నత విద్యా మండలి, నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల మేరకు స్టాఫ్ అర్హత ఉండాలి. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో సాగుతుంది. జిల్లాలో ప్రస్తుతం 13 బీఎడ్ కళాశాలలు ఉన్నాయి. బీఎడ్ కోర్సు రెండేళ్లు నిర్వహిస్తున్నారు. సింగిల్ సెక్షన్ (50 సీట్లు) కళాశాలలు 5, డబుల్ సెక్షన్ (100 సీట్లు) కళాశాలలు 8 ఉన్నాయి. సింగిల్ సెక్షన్ కళాశాలలకు ప్రిన్సిపాల్‌తో పాటు ఏడుగురు అధ్యాపకులు, డబుల్ సెక్షన్‌కు ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్‌తో పాటు 14 మంది అధ్యాపకులు ఉండాలి. బీఎడ్ మొదటి ఏడాది మొదటి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ పూర్తయ్యింది.

గేదెల అక్రమ తరలింపు అడ్డగింత

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా గేదెలను తరలిస్తున్న కంటైనర్‌ను నరసన్నపేట పోలీసులు కాపు కాచి సోమవారం ఉదయం పట్టుకున్నారు. మడపాం టోల్‌గేట్ వద్ద ఈ కంటైనర్‌ను గుర్తించి పట్టుకొని సీజ్ చేశారు. కంటైనర్‌లో 34 గేదెలు ఉండగా వీటిని బరంపురం నుంచి విశాఖపట్నం తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో ఈ కంటైనర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గేదెలను కొత్తవలస గోశాలకు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షేత్రస్థాయిలో కమిటీలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం త్వరలోనే మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను వివరించారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి LiFE

ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం – 532005.
ప్లాట్ నెం. 32, డోర్ నెం. 16-13-25, 2వ క్రాస్ రోడ్డు,
పురుషోత్తం నగర్ కాలనీ, గుజరాతీపేట గ్రామం, శ్రీకాకుళం.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం, 1986 క్రింద విడుదల చేసిన ఎస్.ఒ. నెం. 1533, తేది 14-09-2006 ప్రకారం మరియు తదుపరి సర్క్యులర్ ప్రకారం సర్వే నెం.13, దబ్బగూడ గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా యందు 6.0 హెక్టార్ల విస్తీర్ణంలో కలర్ గ్రానైట్ వెలికి తీయుటకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధముగా ఉన్నవి :

1	సంస్థ పేరు మరియు చిరునామా	శ్రీ మౌనీష్ కుణపరెడ్డి, డోర్ నెం. 55-5-2, అద్దేపల్లి కాలనీ, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, Ph.No. 8333055560, mouneesh.kunapareddy1995@gmail.com
2	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం.13, దబ్బగూడ గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా.
3	అధీకృత వ్యక్తిపేరు మరియు చిరునామా	శ్రీ మౌనీష్ కుణపరెడ్డి, డోర్ నెం. 55-5-2, అద్దేపల్లి కాలనీ, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
4	ప్రాజెక్టు విలువ	రూ. 60.00 లక్షలు
5	ఉత్పత్తి వివరములు	కలర్ గ్రానైట్ సాలీనా – 7,898 ఘ.మీ.
6	తేది, సమయం మరియు జరుగుస్థలం:	**తేది: 18.10.2024 (శుక్రవారం), సమయం: 11.00 గం.లకు. (ఉదయం). వేదిక: ప్రతిపాదిత ప్రాజెక్టు వద్ద, దబ్బగూడ గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళికా నివేదిక మరియు సాఫ్ట్ కాపీలు ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు:

1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం. 2) జిల్లా పరిశ్రమల శాఖ వారి కార్యాలయం, శ్రీకాకుళం. 3) ముఖ్య కార్యనిర్వహణ అధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, శ్రీకాకుళం. 4) సభ్య కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, వైఎస్ఆర్ పర్యావరణ భవనం, ఆటో నగర్, విజయవాడ. 5) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, విశాఖపట్నం. 6) డిప్యూటీ డైరెక్టర్ (ఎస్), కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ – 520010. 7) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, టెక్కలి డివిజన్, శ్రీకాకుళం. 8) ఉపసంచాలకుల వారి కార్యాలయం, గనులు మరియు భూగర్భశాఖ, శ్రీకాకుళం. 9) సహాయ సంచాలకులు వారి కార్యాలయం, గనులు మరియు భూగర్భశాఖ, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా. 10) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం. 11) తహశీల్దార్ వారి కార్యాలయం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా. 12) మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా. 13) గ్రామ పంచాయితీ కార్యాలయం, దబ్బగూడ గ్రామం, రాజపురం గ్రామం మరియు జోదూరు గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా.

పైన తెలిపిన ప్రాజెక్టుకు సంబంధించిన ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల 30 రోజుల లోపు ఈ క్రింది సంతకము చేసిన అధికారికి లిఖితపూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేదీ మరియు ప్రదేశము వద్ద సదస్సులో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేయగలరు.

సం/- పర్యావరణ ఇంజినీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం.

స్థలం : శ్రీకాకుళం
తేది : 16-09-2024

నేటి నుంచి విశ్వకర్మ జయంతి వేడుకలు

- ఐదు రోజుల పాటు ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో పలు చోట్ల నేటి నుంచి విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల దేవశిల్పి విశ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజాదికాలు నిర్వహిస్తారు. శ్రీకాకుళంలోని బలగ, చంపాగల్లి వీధిలో విశ్వకర్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది విశ్వకర్మ జయంతి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి హిందువుల పండుగల జాబితాలో చేర్చింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది. సత్యయుగంలో ఇంద్రుడు పరిపాలించిన ఇంద్రలోకాన్ని, త్రేతాయుగంలో స్వర్గలంకను, ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలొ హస్తినాపురాన్ని, ఇంద్రప్రస్థాన్ని విశ్వకర్మ నిర్మించినట్లు విశ్వసిస్తారు. విశ్వకర్మ నిర్మాణ శిల్పి కావడం వల్ల భక్తి సూచకంగా ఈ రోజున సాంకేతిక నిపుణులు, వివిధ వృత్తుల వారు, పరిశ్రమల వారు వారి పరికరాలను పూజిస్తారు. శ్రీకాకుళంలో పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం వారు ఎక్కువగా పూజిస్తారు.

పట్టణంలో ఏర్పాట్లు

పట్టణంలోని పలు చోట్ల విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. చంపాగల్లివీధిలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అలాగే హడ్కోకాలనీలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అలాగే శ్రీకాకుళం మండలంలోని చాపురం పంచాయతీలోని గోవిందపురం గ్రామం వద్ద చలపాక సూర్యారావు విశ్వకర్మ గార్డెన్‌ను నిర్మించారు. ఈయన వంశధార జలవనరుల శాఖలో ఇంజినీరుగా పనిచేశారు. రిటైరైన తర్వాత తన తండ్రి నారాయణ ఆచారి కోరిక మేరకు ఇక్కడ ఒక గార్డెన్‌ను ఏర్పాటు చేసి ఏటా విశ్వకర్మ జయంతి నిర్వహించి అన్నదానం కూడా చేస్తుంటారు. ఈ ఏడాది కూడా విశ్వకర్మ జయంతి పూజలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గోవిందపురంలో విశ్వకర్మ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన నెయ్యిల సరస్వతి

సారవకోట: మండలంలోని అలుదు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాకివలస గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు గాయాలపాలయ్యారు. మాకివలస నుంచి అలుదు వెళ్తున్న ఆటోలో మాకివలస గ్రామానికి చెందిన నెయ్యిల సరస్వతి, వాన రమ్య, వాన సావిత్రి ఎక్కారు. అయితే అలుదు సమీపానికి వచ్చేటప్పుడు ఆటోలో నుంచి వీరు ముగ్గురు జారి పడిపోవడంతో నెయ్యిల సరస్వతికి తీవ్ర గాయాలయ్యాయి. వాన రమ్య, వాన సాయమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి సారవకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి అనంతరం నెయ్యిల సరస్వతిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో శ్రీకాకుళం, మిగిలిన ఇద్దరినీ ప్రైవేట్ వాహనంలో నరసన్నపేట తరలించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నీ కాయిట్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికల టెన్నికాయిట్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎస్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ద్వితీయ స్థానంలో ఎస్.సాయికుమార్ (విజయనగరం), తృతీయ స్థానంలో కేఎస్ శంకర్‌ప్రసాద్ (తూర్పుగోదావరి)తో పాటు వరుసగా 4,5,6 స్థానాల్లో జి.మహీధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్(విశాఖపట్నం), అలాగే బాలికల విభాగం నుంచి ప్రథమ స్థానంలో కె.జ్యోతిక (అనంతపురం), ద్వితీయ స్థానంలో హెచ్.దీక్షిత (అనంతపురం), తృతీయ స్థానంలో హెచ్.స్పందన (అనంతపురం)తో పాటు వరుసగా 4,5,6 స్థానాల్లో ఆర్.సాంస్కృతి (పశ్చిమ గోదావరి), కె.ఇందు (విజయనగరం), బి.గాయిత్రి(చిత్తూరు) నిలిచారు. జమ్ము కాశ్మీర్‌లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న జాతీయ టెన్నికాయిట్ పోటీలకు వీరు ఎంపికైనట్లు క్రీడా నిర్వాహకులు పైల గజేంద్ర ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైన బాలికలు అనకాపల్లిలో, బాలురు తూర్పుగోదావరి మండపేటలో శిక్షణ పొందుతారని వారు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.



గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు, నాయకులు

సీఎం సహాయ నిధికి శ్రీకాకుళం మాజీ సైనికుల విరాళం

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయవాడలో సర్వం కోల్పోయిన వరద బాధితుల సహాయార్థం జిల్లా మాజీ సైనికులు భారీగా విరాళాన్ని అందజేశారు. తమ వంతుగారూ.5 లక్షల చెక్కు (5,00,116)ను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ద్వారా అందజేశారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్యకు అనుబంధంగా ఉన్న 16 యూనియన్లు సహాయం చేశాయని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం పేర్కొన్నారు.

సోమవారం కేంద్ర మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఎలక్షన్ ముందు ఇచ్చిన వాగ్దానాలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గట్టిగా కృషి చేస్తున్నానని, జిల్లాలో అమర జవాన్ స్థూపాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న జిల్లా మాజీ సైనికులు, వీర నారీమణులు

సమన్వయ సిబ్బందే కీలకం

శ్రీకాకుళం క్రైమ్: కేసుల పరిష్కారం, శిక్షలు పడేందుకు కోర్టు సమన్వయ సిబ్బంది విధులు కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకొని సూచనలు చేశారు. నెల వారీగా కోర్టులు జారీ చేసే సమన్లు, వారెంట్లను పోలీస్ స్టేషన్ ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన

శ్రీకాకుళం న్యూకాలనీ: అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ భారత్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పు పడుతూ శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద సోమవారం జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భారతదేశం పరువు ప్రతిష్ఠకు భంగం వాటిల్లే విధంగా ఆయన వాఖ్యానించడం సరికాదన్నారు. పెద్ద ఎత్తున రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మహిళా ఉపాధ్యాయులకు పోటీలు

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్వర్ణోత్సవాలు సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం మహిళా ఉపాధ్యాయులకు పలు పోటీలను నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి.ధనలక్ష్మి, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి జ్యోతిని వెలిగించి స్వాగత ఉపన్యాసం చేశారు.



మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న మహిళా టీచర్లు



బాల(ల) గణపతి

టెక్కలి ఎన్టీఆర్ కాలనీ మూడో లైన్‌లో బాల గణపతికి బాలలు పూజలు చేశారు. బాలల మధ్య బాల గణపతి చూడముచ్చటగా కనిపించారు.

– టెక్కలి రూరల్

పేదలపై టీడీపీ పెద్దల ప్రతాపం

జలుమూరు: తిమడాంలో 90 ఏళ్లుగా నివాసం ఉంటోన్న ఓ పేద కుటుంబంపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. తొంభై ఏళ్లుగా ఆ కుటుంబం ఇక్కడే నివసిస్తుండగా.. వైఎస్సార్ సీపీ హయాంలో పట్టా ఇచ్చారు. ఆర్థిక స్థోమత లేక వారు ఇల్లు కట్టుకోలేకపోయారు. మట్టి గోడలతో చిన్నపాటి ఇల్లు కట్టుకొని ఇంటి ముందు టిఫిన్ బండి పెట్టి జీవనం సాగిస్తున్నారు. వీరు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే అనుమానంతో కొందరు టీడీపీ నాయకులు పట్టాను మాయం చేసి పోలీసులతో వేధిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఇంటిలో గొడెయ అమ్మన్న, కృష్ణ మూర్తి టిఫిన్ విక్రయిస్తూ జీవిస్తున్నారు. కొన్నేళ్ల కిందట కృష్ణమూర్తి మృతి చెందాడు. 25 రోజుల కిందట అమ్మన్న కూడా చనిపోయారు. దీంతో టీడీపీ పెద్దల కళ్లు ఆ ఇంటిపై పడ్డాయి. అమ్మన్న మృతిని సాకుగా తీసుకుని ఆ పేద కుటుంబంపై టీడీపీ పెద్దలు తమ ప్రతాపం చూపుతున్నారు. అమ్మన్న బతికి ఉన్నప్పుడే కుమార్తె రమణమ్మ, అల్లుడు బాబూరావు ఇక్కడే టిఫిన్ షాపు పెట్టారు. ఇప్పుడు ఇంటి స్థలం తమదే అంటూ టీడీపీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారని వారు వాపోతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా సైతం తీసుకొని ఇప్పుడు అది జిరాయితీ స్థలం అని బెదిరిస్తున్నారని తెలిపారు. న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించామని అయినా బెదిరింపులు మానడం లేదని అంటున్నారు. దీనిపై జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు మాట్లాడుతూ కేసు కోర్టులో ఉన్నందున దీనిపై మాట్లాడకూడదని వారిని పిలిపించి చెప్పామన్నారు.



ఇంటి పట్టాతో రమణమ్మ, బాబూరావు

జ్వరాల విజృంభణ

పాతపట్నం: మండలంలోని పాతపట్నం, బూరగాం, చిన్న మల్లిపురం, బడ్డుమర్రి, శిష్టుజగన్నాథపురం, బోరుభద్ర, చింతగూడ, బెన్నగూడ, ఆర్.ఎల్.పురం, సూర్యనారాయణపురం, రేంగూడ తదితర గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణ రోజుల్లో స్థానిక ఆస్పత్రికి 120 మంది వరకు వచ్చేవారు. ఇటీవల 160 మంది వరకు వస్తున్నారు. మండలంలోని గంగువాడ, బైదలాపురం రెండు పీఎచ్‌సీలులతో పాటు సబ్ సెంటర్లు ఉన్నా మండల కేంద్రానికే రోగులు వస్తున్నారు. వీరితో పాటు పాతపట్నం, పర్లాకిమిడి ఉన్న పలు ప్రైవేట్ క్లినిక్‌లలో మరో 400 మంది రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. మండలంలో రోజురోజుకు జ్వర పీడితులు పెరుగుతున్నందున గ్రామాల్లో క్లోరినేషన్ చేయించాల్సి ఉన్నా ఎక్కడా కానరావడం లేదు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించడంతో పాటు సబ్ సెంటర్ల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వంచాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

యువకుడు ఆత్మహత్య

నరసన్నపేట: ఆర్థిక ఇబ్బందులకు తోడు పేదరికంతో స్థానిక కలివరపు పేటకు చెందిన వైశ్యరాజు నాగరాజు (32) సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోని ఫ్యానుకు ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. అలాగే 32 ఏళ్లయినా వివాహం కాకపోవడం కూడా ఓ కారణమని సమాచారం. మృతునికి తల్లిదండ్రులు లక్ష్మి, లక్ష్మణరావులతో పాటు మరో సోదరుడు గురునాథ్ ఉన్నారు. ఒక ఫైనాన్సర్ వద్ద కలెక్షన్ బాయ్‌గా నాగరాజు పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



సంఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం

యువకుడు అనుమానాస్పద మృతి



ఇచ్ఛాపురం రేల్వే ట్రాక్ పై పడి ఉన్న మడపాల సింహాద్రి మృతదేహం

మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకుడు మడపాల సింహాద్రి(35) ఆదివారం సాయంత్రం ఇచ్ఛాపురం రైల్వే ట్రాక్ పై విగతజీవిగా కనిపించాడు. అక్కడి రైల్వే పోలీసులు గుర్తుతెలియని మృత దేహమని కేసు నమోదు చేశారు. అయితే సోమవారం సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫొటో చూసి హైదరాబాద్‌లో ఉంటున్న మృతుని తండ్రి లక్ష్మణ గుర్తుపట్టాడు. వెంటనే గ్రామస్తుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో యువకుని పేరు, వివరాలు తెలిశాయి. సింహాద్రి రెండేళ్లుగా ఇచ్ఛాపురంలో ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం నాడు రైల్వే ట్రాక్ పై మృతి చెంది కనిపించాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి హైదరాబాద్ నుంచి బయల్దేరారు. ఆయన వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.

ఆటో బోల్తా: ఏడుగురికి గాయాలు

రణస్థలం: కుమ్మరిపేట గ్రామ సమీపంలో గల మలుపు వద్ద ఆటో బోల్తా పడి ఏడుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్నేహితులతో కలిసి బావరాజు పవన్ కుమార్ అనే వ్యక్తి ఆటోలో రణస్థలం నుంచి చిల్లపేట యర్రవరం వెళుతుండగా కుమ్మరిపేట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడగా.. ధర్మవరం అఖిల్ అనే యువకుడికి బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులంతా విద్యార్థులే. క్షతగాత్రుడు అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి

పర్లాకిమిడి: పట్టణంలోని గణపతి ఉత్సవాల నిమజ్జన సమయంలో ఐదేళ్ల బాలికపై 51 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జన ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో పలాసకు చెందిన బైనపల్లి శేఖర్ బాలికను టాటా ఏస్ వాహనంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించాడు. తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడం లేదని వెతుకుతుండగా, కొంతమంది చిన్నారిని గమనించి కాపాడారు. అనంతరం శేఖర్‌ను బయటకు తీసుకొచ్చి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించినట్లు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. నిందితుడు గత కొంతకాలంగా స్థానిక కుంభారీ వీధిలో నివసిస్తున్నాడు. పర్లాకిమిడి ఆదర్శ పోలీసులు సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి పోక్సో చట్ట ప్రకారం కేసు పెట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9037]

■ Pice app ఆన్ బోర్డింగ్ ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 17 వేలు +T.A 3 వేలు,Q: ఇంటర్/డిగ్రీ. సెల్: 9912126586,9948212327. [A-1348]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph:9640528899, 9640648899 [H-796278]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995984445 [HA-98491]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Q:10th to Any Degree, Sal:18000/- to 25000/- (Work from available)✆8309728752. [T-778742]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.